క్లుప్తంగా

ఎగసి పడుతున్న అలలు



వాసాలతిప్పలో పడవను ఒడ్డుకు చేర్చుకుంటున్న మత్స్యకారులు

ఉప్పలగుప్తం: బంగాళఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మండలంలో సముద్ర తీరప్రాంతాలైన ఎస్.యానం, వాసాలతిప్ప గ్రామాల్లో సముద్రపు అలలు శుక్రవారం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. వాసాలతిప్ప గ్రామంలో మత్స్యకారులు సముద్రంలో ఉన్న పడవలను ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. తుపాను కారణంగా ఈదురు గాలులు వీచే అవకాశం ఉండడంతో మత్స్యకారులు వేటకు విరామం ప్రకటించి అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

రమేష్‌కు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



రమేష్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, స్థానిక పట్టణ దేవత సుబ్బాలయ్మ దేవస్థానం మాజీ చైర్మన్ నూలు రమేష్ ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి, మీనాక్షి ఫౌండేషన్ చైర్‌పర్సన్ బేబీ మీనాక్షి, పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, మీనాక్షి ఫౌండేషన్ ప్రతినిధులు స్వర్ణ, రజని, మీనాక్షి తదితరులు రమేష్‌ను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలలో వైద్య పరీక్షలు

ఉప్పలగుప్తం: రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లక్ష్మీప్రసన్న శుక్రవారం సిబ్బందితో కలసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 450 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ శాతం, కంటిచూపు, వినికిడి తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రామకష్టమూర్తి, కె.శుభారత్నం, జె.నాగమణి, అనురాధ, రాణికుమారి, అరుణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్స్‌డేపై అవగాహన



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

అల్లవరం: రాష్ట్ర కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ ఏడో తేదీన జరగబోయే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌పై అల్లవరం మండల రిసోర్స్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో 2 ఎస్.ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన కార్యకమంలో పిల్లల బంగారు భవిష్యత్ కోసం 'బడి వైపు ఒక అడుగు' అనే నినాదంతో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు పాఠశాలల మధ్య సంబంధాన్ని బలోపేతం చేసి విద్యార్థుల తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.కృష్ణమోహన్ జెడ్పీ, యూపీ, ఎంపీపీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్న మల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన



చెన్న మల్లేశ్వరస్వామికి బిల్వార్చన చేస్తున్న అర్చక స్వాములు

అమలాపురం టౌన్: పట్టణంలోని పురాతన శివ క్షేత్రం చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ పూజా క్రతువును కళ్లారా చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. అనంతరం ఆలయం ఎదుట జరిగిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ సేవా సమితి, అన్న సమారాధన కమిటీ ప్రతినిధులు, ఆ ప్రాంత యువకులు అన్న సమారాధనలో భక్తులకు సేవలు అందించారు. దాదాపు 15 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఫెంగల్.. గుండెల్లో గుబుల్

- తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- హడావుడిగా పంటల ఒబ్బిడి
- ఇబ్బంది పడుతున్న రైతులు



చొల్లంగిలో యంత్రాలతో వరి కోతలు

ముమ్మిడివరం: ఫెంగల్ తుపాను ప్రభావంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతుల గుండెల్లో గుబులు పుట్టింది. అడపా దడపా కురుస్తున్న వర్షాలు గాలులతో దినదిన గండంగా మారింది. అయితే శుక్రవారం పెను గాలులతోపాటు వర్షం తోడవ్వడంతో పంటను ఒబ్బిడి చేసుకునేందుకు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది తొలకరి ప్రారంభం నుంచి రైతులు పడిన కష్టాలు వర్ణాతీతం. డిసెంబర్ మూడో తేదీ వరకు ఫెంగల్ తుపాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఖరీఫ్ పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

పంట చేతికందే దశలో..

ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో దాదాపు 42వేల ఎకరాలలో ఈఏడాది ఖరీఫ్ వరి సాగు చేశారు. గత మూడు రోజులుగా తుపాను ప్రభావంతో మబ్బులతో కూడిన వాతవరణం ఏర్పడి నప్పటికి వర్షం లేకపోవడంతో కొంత మంది రైతులు యంత్రాలతో కోత కోయించి ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. అలాగే కొంత మంది పశుగ్రాసం కోసం కూలీలతో వరి కోతలు కోయడం మొదలు పెట్టి ఆదరా బాదరాగా పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. అయితే శుక్రవారం ఒక్కసారిగా ఈదురు గాలులకు వర్షం తోడవ్వడంతో రైతులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కోత కోసిన వరి పనలను ఇతర ప్రాంతానికి తరలించి కుప్పలు వేస్తున్నారు. కోసిన వారి ధాన్యం రాశులుగా పోశారు.



ముమ్మిడివరంలో పశుగ్రాసం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు



గాడిలంకలో బరకాలతో కప్పిన ధాన్యం రాశులు

వర్షం రావడంతో బరకాలతో కప్పి భద్ర పరుస్తున్నారు. ఈదురు గాలులకు పలు గ్రామాలలో పక్వానికి వచ్చిన పంట చేలు నెలకొరిగి ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. తుపాను దెబ్బ తగిలితే పంట నష్టపోయి అప్పుల పాలవుతామని వారు ఆందోళన చెందుతున్నారు. తుపాను కారణంగా వీలైనంత త్వరగా పంటలను కోత కోయించి ధాన్యాన్ని కల్లాలోనే అమ్మేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో వర్షం పడడంతో వారి ఆశలు అడియాసలైయ్యాయి. నియోజకవర్గంలో వరి కోతలు పూర్తవ్వడానికి మరో పది పదిహేను రోజులు పైగా పట్టే అవకాశముందని అప్పటి వరకూ వాతావరణం అనుకూలిస్తే పెట్టుబడులతో బయట పడతామని రైతులు అంటున్నారు.

మత్స్యకారుల అప్రమత్తం

నియోజకవర్గంలో తీర ప్రాంతాలైన బైరవపాలెం, మగసాని తిప్ప,బలుసుతిప్ప పల్లం, బ్రహ్మ సమేద్యం, పండి, పోర చిర్రయానాం తదితర గ్రామాల్లో మత్స్య కారులు సముద్రంలో వేటపైనే ఆధార పడి జీవిస్తున్నారు. ప్రస్తుతం ఫెంగల్ తుపాను కారణంగా వేటకు విరామం చెప్పారు. అయితే తుపాను ప్రభావం మరింత తీవ్రతరం కావచ్చుననే హెచ్చరికలతో మత్స్యకార గ్రామాల్లో అధికారులు హెచ్చరికలు జారీ చేసి మరింత అప్రమత్తం చేస్తున్నారు.

చేతికందే దశలో..



ఆరుగాలం కష్టపడి ఖరీఫ్ సాగుచశారు. పంట చేతికొచ్చే దశలో తుపాను కారణంగా పంట దిగుబడి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. రెండు ఎకరాలలో ఖరీఫ్ సాగు చేశారు.సుమారు రూ.40వేలు వరకు పెట్టుబడి పెట్టాను. ఈదురు గాలులకు వరి చేలు నెలకొరిగితే పంట దిగుబడులు కోల్పోయి పెట్టుబడులుకూడా రాని పరిస్థితి ఏర్పడుతుంది.

–పెయ్యల శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

అవగాహన కల్పించాం



తుపానుపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాం. తుపాను ప్రభావానికి పంట దెబ్బతినకుండా వరి కోతలు వాయిదా వేసుకోవాలి. వరి కుప్పలపై బరకాలు కప్పి పంట వర్షానికి తడవ కుండా చూసుకోవాలి, ఇప్పటికే పనలపై ఉన్న పంటను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలి

– ఎస్.ప్రశాంతకుమార్, వ్యవసాయాధికారి ,ముమ్మిడివరం

అనధికార లేఅవుట్లపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవివర్మ

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్ల యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నగర పంచాయతీ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లను ఎవరు కొనుగోలు చేయొద్దని, ఆయా ప్లాట్లలో భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయమని, మౌళిక వసతులు కల్పించమని తెలిపారు. నగర పంచాయతీ ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాలపై పన్నులను సకాలంలో వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో 30వ తేదీనే పింఛన్లు పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో కాకినాడ సిటీ సీడీఓ జి. సాల్మన్ చక్రవర్తి, మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ పీవీ సుధాకర్, ఆర్ఐ భాస్కరరావు,వార్డు సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి చోరీపై ఫిర్యాదు



అక్రమంగా మట్టిని తవ్విన ప్రదేశం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామంలో స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో మట్టిని అక్రమంగా తవ్వి తరలించడంపై బాధితులు ధూళిపూడి నరసింహారావు, వెంకట సూర్యనారాయణలు అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ తండ్రి వారసత్వంగా వచ్చిన ఐదున్నర సెంట్ల స్థలంలో సుమారు ఆరు అడుగుల మేర మట్టిని తవ్వేసి కొందరు దౌర్జన్యంగా తరలించివేశారని బాధితులు ఆరోపించారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే తవ్వి తరలించిన మట్టిని యథాస్థానంలో వేయించాలని కోరంగి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఆ స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించాలని, సర్వే పూర్తయ్యే వరకూ ఎవరూ ఆ భూమిలోకి వెళ్లకూడదని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ చెప్పినట్లు బాధితులు తెలిపారు.

వైభవంగా లక్ష రుద్రాక్ష పూజా మహోత్సవం

అమలాపురం టౌన్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రవణం వీధిలోని శివాలయం రోడ్డులో సర్వ మంగళ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో 24వ లక్ష రుద్రాక్ష పూజా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవికుమార్, నాగవల్లి దంపతులు కర్తలుగా మహోత్సవం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని స్వామికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తుల సహకారంతో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న గాలి గోపురానికి మంత్రి సుభాష్ శంకు స్థాపన చేశారు. అనంతరం మంత్రి సుభాష్‌కు రుద్రాక్ష మాలలు, స్వామి చిత్ర పటాన్ని బహుకరించి ఘనంగా సత్కరించారు. కాశీ నుంచి రప్పించిన లక్ష పంచ ముఖ రుద్రాక్షలతో రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న సర్వ మంగళదేవి ఆలయంలో లక్ష కుంకుమ పూజలు, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సింధూర పూజ, గణపతి ఆలయంలో లక్ష బిల్వార్చన, షిర్డీ సాయి ఆలయంలో లక్ష నాగవల్లీ పూజలు చేశారు. గురుదేవులు వాడ్రేవు శ్రీనివాసరావు పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ అల్లవరపు దీక్షితుల బ్రహ్మత్వంలో 11 రుత్వికులు ఈ పూజా మహోత్సాన్ని వేద మంత్రాల నడుమ నిర్వహించారు. పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, స్థానిక ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రవికుమార్ వచ్చిన అతిధుల ఆలయం తరుపున రుద్రాక్ష మాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు యర్రమిల్లి పాండురంగారావు, మాచిరాజు సాయి కృష్ణ శ్రావణ్, గారపాటి పండుబాబు, కె.వెంకట నాగ భూషణం తదితరులు భక్తులకు సేవలు అందించారు.



రామలింగేశ్వరస్వామి ఆలయ గాలి గోపురానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

హస్త కళలు, ప్రదర్శనలపై అవగాహన

యానాం: హస్తకళలు, ప్రదర్శనలపై కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్రాఫ్ట్ డెమోన్‌స్ట్రేషన్ కమ్ అవేర్‌నెస్‌పై శుక్రవారం స్థానిక కనకాలపేట ఎస్‌కేఎస్‌బీఎన్ ప్రభుత్వ హైస్కూల్‌లో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 27వ తేదీ నుంచి 29 వరకు మూడు రోజులపాటు జరిగిన ఈ సదస్సుకు అతిథులుగా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, హెచ్‌ఎం నళిని, జ్యోతి పాల్గొని మాట్లాడుతూ నేటి తరం హస్తకళలు, అలనాటి వైభవం, ఆదరణ, వాటిని నేర్చుకోవాలనే ఆసక్తిని కల్గించడానికి ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అనంతరం హస్తకళల తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హస్తకళలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శాసన సభ్యుడు లేకుండానే భూమి పూజలు

- రూ.22 కోట్ల పనులకు మల్లాడి శ్రీకారం
- ఆహ్వానం అందలేదంటున్న ఎమ్మెల్యే అశోక్
- హక్కులపై న్యాయ స్థానానికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే
- శాసనసభ్యుడి అధికారాలపై చర్చనీయాంశమైన వైనం

యానాం: యానాం నియోజకవర్గ శాసనసభ్యుడుని ఆహ్వానించకుండానే రూ.22కోట్ల అభివృద్ధి పనులకు శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భూమి పూజలు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రజలతో ఎన్నుకోబడిన శాసనసభ్యుడి చేత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించడం, శంకుస్థాపనలు చేయడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ వాటిని తోసి రాజని మల్లాడి పనులకు శ్రీకారం చుట్టడం అధికారులు సైతం కార్యక్రమాలకు హాజరుకావడం తదితర పరిణామాలు వివాదాస్పదమయ్యాయి.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మల్లాడి

దశల వారీగా అభివృద్ధి పనులు

నియోజకవర్గ పరిధిలో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతానని నామినేటెడ్ పదవిలో ఉన్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం రూ.22కోట్ల అభివృద్ధి పనుల్లో భాగంగా వెంకట్‌నగర్, దొమ్మేటిపేట, సావిత్రీనగర్ గ్రామాల్లో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో రూ.19.50 కోట్ల అభివృద్ధి నిధులు, రూ.2.30కోట్ల సీఎస్ఆర్ నిధులతో 58 పనులు చేసేందుకు సిద్ధం కాగా అప్పో ఎన్నికల కోడ్ రావడంతో పనులను నిలిచిపోయాయన్నారు. అయితే ప్రస్తుతం ఆ సొమ్ము వడ్డీతో కలిపి రూ.25కోట్లు అయ్యిందని ఆ మొత్తంతో పనులు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మెన్ పెండెం సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

హక్కులపై న్యాయ స్థానాన్ని ఆశ్రయించిన ఎమ్మెల్యే అశోక్

రూ.22 కోట్ల పనుల్లో భాగంగా పలు పనులకు సంబంధించి భూమి పూజలకు తనకు అధికారులు చెప్పలేదని, కనీస ఆహ్వానం లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూమి పూజలకు సంబంధించి తేదీలను సైతం కనీసం చర్చించలేదన్నారు. తాను ప్రజా సమస్యలనుకేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు న్యూఢిల్లీ వెళ్లానని ఈ నేపథ్యంలో తాను లేని సమయంలో మల్లాడి కృష్ణారావు ద్వారా భూమిపూజలు అధికారులు చేయించడం తన హక్కుల ఉల్లంఘనేనన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన శాసనసభ్యుడిగా తన హక్కులను కాపాడుకోవడానికి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు.

పశువులకు వైద్య పరీక్షలు



దూడకు పరీక్షలు చేస్తున్న జేడీ వెంకట్రావు

అల్లవరం: తూర్పులంక గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.వెంకట్రావు పాల్గొని పశువులను పరీక్షించారు. ఈ శిబిరంలో భాగంగా పశువులకు ఉచితంగా చూలు పరీక్షలు, క్రమేపి యదకు వస్తున్న పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, ఎదలో ఉన్న పశువులకు కృతిమ గర్భధారణ, 4 నుంచి 8 నెలలు దూడలకు బ్రుసెలోసిస్ వ్యాధి నిరోధక టీకాలు, కోళ్లకు వ్యాధి నిరోదక టీకాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడలి గంగాచలం, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వేంకటేశ్వరావు పశువర్ధక శాఖ ఏడీ విజయరెడ్డి, వైద్యులు మేడిద నారాయణరావు, పశు వైద్యాధికారులు కల్యాణి, మాధురి, శివతేజ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

10 నుంచి షాపింగ్ ఫెస్టివల్



పుదుచ్చేరి షాపింగ్ ఫెస్టివల్‌పై మాట్లాడుతున్న ఆర్ఏఓ మునిస్వామి, చిత్రంలో మల్లాడి

యానాం: ఈ ఆర్థిక సంవత్సరం ప్రణాళికలో భాగంగా పర్యాటకం, వర్తకం, వాణిజ్యం తదితర వాటిని ప్రోత్సహించే విధానంలో భాగంగా వచ్చే నెల పదో తేదీ నుంచి పుదుచ్చేరి నాలుగు రీజియన్‌లైన యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్‌లలో నిర్వహిస్తున్నట్టు ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యానాంలో సైతం పుదుచ్చేరి షాపింగ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు దీనిలో భాగంగా నియోజకవర్గ పరిధిలో ఏవైనా షాపుల్లో హాస్పటల్స్, ఫార్మా, మిగిలిన లైఫ్‌సేవింగ్ ఎక్విప్‌మెంట్స్ తప్ప హ్యాండ్‌లూమ్స్, జ్యుయిలరీ, ఎలక్ట్రానిక్స్, హోటల్స్, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్‌లో ప్రతి రూ.500 కొనుగోలుపై ఒక కూపన్ ఇస్తారన్నారు. ఆవిధంగా ఈ స్కీమ్ ద్వారా రూ.10 కోట్ల బహుమతులు ఉంటాయన్నారు. కారు, స్కూటర్, టేబుల్ టాప్ వెట్ గ్రైండర్, మిక్సీ, ఎలక్ట్రిక్ కెటిల్, కెచెన్ వేర్ సెట్, మిల్క్ కుక్కర్, ఎస్ఎస్ డిన్నర్‌సెట్ ఆ విధంగా మొత్తం 1.24.920 రూపాయలతో ప్రైజ్‌లు ఉన్నాయన్నారు. యానాంలో మొత్తం 10 లక్షల కూపన్లు సీరియల్ నెంబర్ వారీగా ఉంచినట్లు జనవరి నెలాఖరున డ్రా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, వర్తకసంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న, గాజుల బాబి తదితరులు పాల్గొన్నారు.

దొమ్మేటిపేటలో కార్తిక వనసమారాధన

యానాం: నియోజకవర్గ శివారు దొమ్మేటిపేట గ్రామంలో కొలువైన కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం కార్తిక వనసమారాధన కార్యక్రమం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ ఆలయంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సత్కరించారు.

14న మాలల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం రూరల్: సమయం లేకపోవడం, వాతావరణ పరిస్థితుల కారణంగా డిసెంబర్ 7వ తేదీన ప్రకటించిన మాలల ఆత్మీయ సమ్మేళనం డిసెంబర్ 14వ తేదీన అమలాపురంలో జరుగుతుందని దళిత జేఏసీ చైర్మన్ డీబీ లోక్ తెలిపారు. కోనసీమ జిల్లా 22 మండలాల మాల ముఖ్య నేతల సమావేశం శుక్రవారం ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో జంగా బాబూరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన లోక్ మాట్లాడుతూ జిల్లాలో 22 మండలాలలో ఉన్న మాలలు అందరూ ఐక్యంగా డిసెంబర్ 14వ తేదీన మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి అందులో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, రేవు తిరుపతిరావు, పాలమూరి మోహన్, గొల్లపల్లి డేవిడ్ రాజు నెల్లి లక్ష్మీపతి, సాపే బాలరవి, నెల్లి వెంకటరమణ, చింతా రాజబాబు, బత్తుల మురళి, కోట రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

తాళ్లరేవు: బాల్య వివాహాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ముఖ్యంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతోనే బాల్య వివాహాలను నియంత్రించవచ్చని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ వెంకటరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ వంజరాన మాధవి అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక చట్టం, కిశోర వికాసం తదితర అంశాలపై అవగాహణ సదస్సు నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కె.సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, బాల్య వివాహాలు జరక్కుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన కల్పించారు. అన్ని శాఖల అధికారులు సమష్టి బాధ్యతతో బాల్య వివాహాలను నియంత్రించాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సామూహికంగా బాల్య వివాహాల నియంత్రణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, విద్యాశాఖ, డీఆర్డీఏ, వెలుగు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ తదితర మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి వెంకట్రావు

12 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్ తెలిపారు. కాకినాడకు చెందిన కొమ్మిరెడ్డి పేరయ్య కాపు 12 మద్యం సీసాలను బైక్‌పై తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అనంతరం రిమాండ్‌కు తరలించామన్నారు.

సాయుధ బలగాల పతాక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



సాయుధ బలగాల పతాక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: సాయుధ బలగాల పతాక దినోత్సవ ఫండ్ కోసం విరివిగా విరాళాలు అందించి సైనికుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సాయుధ బలగాల పతాక దినోత్సవ ఫండ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సైనికుల సంక్షేమానికి మిలట్రీ వెల్ఫేర్ ఫండ్‌కు విరాళాలు అందిస్తూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ అధికారి కెప్టెన్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు. జిల్లాలోని మేజర్ డ్రైన్ల మురికి నీరు మూలంగా జలాలు కాలుష్యం కాకుండా నివారణ చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ సైంటిస్ట్ ఆర్ఎస్ రావు కోనసీమ జిల్లాలో నీటి కాలుష్య ప్రమాణాలపై సర్వేను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ తిలకించారు. ఈ కార్య క్రమంలో టీ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.